## గోపాల్‌రావుపేటలో మధ్యాహ్న భోజనం తనిఖీ



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఏపీఎం

జగిత్యాల రూరల్, డిసెంబర్ 2: గోపాల్‌రావుపేటలోని ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన అమలు తీరును ఏపీఎం గంగాధర్ సోమవారం తనిఖీ చేశారు. భోజన నాణ్యత ప్రమాణాలు, రోజువారీ మెనూ, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి భోజనం ఎలా ఉంటుందని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం సత్యనారాయణ, టీచర్లు పాల్గొన్నారు.

## విజయవంతం చేయండి

ధర్మపురి, డిసెంబర్2: పెద్దపల్లి జిల్లాలో ఈ నెల 4న నిర్వహించే యువవికాస్ బహిరంగ సభకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కోరారు. సోమవారం ధర్మపురి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. సభలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొంటున్నారని, కాంగ్రెస్ సర్కారు ఏడాది పాలనలో ఇప్పటివరకు చేపట్టిన అభివృద్ధి పనులపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగిస్తారని చెప్పారు. పాశిగామలో నిర్మించతలపెట్టిని ఇథనాల్ ఫ్యాక్టరీ స్థలంలో 50 పడకల దవాఖాన నిర్మించాలని ప్రభుత్వానికి విన్నవించామన్నారు. సమావేశంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సంగనబట్ల దినేశ్, నాయకులు చిలుముల లక్ష్మణ్, వేముల రాజేశ్, సుధాకర్ ఉన్నారు.

## పర్యావరణాన్ని పరిరక్షించాలి

జగిత్యాల/ జగిత్యాల టౌన్/ కోరుట్ల రూరల్, డిసెంబర్ 2: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని కలెక్టర్ సత్య ప్రసాద్ పేర్కొన్నారు. ప్రపంచ పర్యవరణ పరిక్షణ వారోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు బీఎస్ లత, గౌతంరెడ్డి, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి ఆర్డీవోలతో కలిసి పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి అధికారులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అలాగే జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఆయా స్కూళ్ల ప్రధానోపాధ్యాయులు అవగాహన కల్పించారు. డీఈవో ఆదేశాల మేరకు కార్యక్రమాన్ని నిర్వహించి, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కోరుట్ల మండలం చిన్నమెట్‌పల్లి పంచాయతీ ఆవరణలో పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం అవుతామని పేర్కొంటూ గ్రామస్తులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి ప్రేమలత, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# భోజన తయారీలో అలసత్వం వద్దు




జగిత్యాల రూరల్: అవగాహన సదస్సులో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత

- నాణ్యమైన సరుకులు, కూరగాయలనే వాడాలి
- వంట గదిని శుభ్రంగా ఉంచుకోవాలి
- అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత
- వంట చేయడంలో జాగ్రత్తలపై అవగాహన
- ఆయా మండలాల్లోనూ అధికారుల సమీక్ష

జగిత్యాల రూరల్, డిసెంబర్ 2: ప్రభుత్వ విద్యాలయ వసతి గృహాల్లో భోజన తయారీలో నిర్లక్ష్యం వద్దని, నాణ్యమైన సరుకులనే వినియోగించాలని అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, సంక్షేమ శాఖల్లో వసతి గృహాల్లో పనిచేసే కుక్, కామాటి, సహాయకులు భోజనం తయారీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సోమవారం జిల్లా సమీకృత కార్యాలయంలో అడిషనల్ కలెక్టర్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించి, మాట్లాడారు. వంట సిబ్బంది వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు వంటగదులను శుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. బియ్యంలో రాళ్లు, మెరిగలు లేకుండా చూసుకోవాలని, కూరగాయలు ఉప్పునీటిలో కడగాలని, అన్నంలో పురుగులు లేకుండా చూసుకోవాలని సూచించారు. కుల్లిన కూరగాయలను ఎట్టి పరిస్థితుల్లో వాడొద్దని, నాణ్యమైన సరుకులనే వినియోగించాలన్నారు. వసతిగృహ విద్యార్థులపై ప్రేమతో మెలగాలని, ఇల్లు వదిలి మనదగ్గర ఉంటున్నందున తల్లిదండ్రులు లేని లోటును తీర్చాలని సూచించారు. వంటగదిలో మొబైల్స్ వాడొద్దన్నారు. చెప్పిన సూచనలు తప్పకుండా పాటించాలని, నిర్లక్ష్యం చేస్తే సంబంధిత వసతి గృహ సంక్షేమాధికారితో పాటు నాల్గో తరగతి సిబ్బందిని కూడా బాధ్యులను చేసి తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం సిబ్బందికి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రాజ్‌కుమార్, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి సునీత, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి ఆర్ ఎస్ చిత్రు, జిల్లా కోఆర్డినేటర్ నాగేశ్వర్ రావు, జిల్లా ఫుడ్ సెఫ్టీ అధికారి అనూష ఉన్నారు.

### నాణ్యమైన భోజనం పెట్టాలి

రాయికల్/ ఇబ్రహీంపట్నం/కోరుట్లరూరల్, డిసెంబరు 2: ప్రభుత్వం పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని అందించాలని రాయికల్, ఇబ్రహీంపట్నం తహసీల్దార్లు ఖయ్యూం, ప్రసాద్, కోరుట్ల ఎంపీడీవో రామకృష్ణ పేర్కొన్నారు. సోమవారం రాయికల్ పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన వంట కార్మికులకు తహసీల్దార్ ఖయ్యూం అవగాహన కల్పించగా, ఇబ్రహీంపట్నంలోని రైతు వేదికలో మధ్యాహ్న భోజన పథకం అమలుపై మధ్యాహ్న భోజన కార్మికులకు, హెచ్‌ఎంలతో తహసీల్దార్ ప్రసాద్, కోరుట్ల పట్టణంలోని ఎమ్మార్సీలో మధ్యాహ్న భోజన ఏజెన్సీ సభ్యులతో ఎంపీడీవో రామకృష్ణ సమీక్షించారు. ఆయా కార్యక్రమాల్లో వారు మాట్లాడారు. మధ్యాహ్న భోజన నిర్వాహకులు వంట గదిని శుభ్రంగా ఉంచుకోవాలని, తాజా సరుకులతోనే వంట చేయాలని సూచించారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని, నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవన్నారు. రాయికల్‌లో ఎంఈవో రాఘువులు, ఉపాధ్యాయులు కాపు శ్రీనివాస్, యూవీ రమ ణి, మామిడాల శ్రీనివాస్, ఇబ్రహీంపట్నంలో ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంఈవో మధు, జడ్పీస్కూల్ కాంప్లెక్స్ రాజన్న, మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు. కోరుట్లలో ఎంఈవో గంగుల నరేశం, ఏజెన్సీ సభ్యులు పాల్గొన్నారు.

# సత్వర పరిష్కారం చూపాలి



ప్రజావాణిలో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ బీ సత్యప్రసాద్

- ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టొద్దు
- కలెక్టర్ బీ సత్య ప్రసాద్
- 33 అర్జీల స్వీకరణ

జగిత్యాల, డిసెంబర్ 2: ప్రజావాణిలో ప్రజలు ఇచ్చే దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టొద్దని, సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలని కలెక్టర్ బీ సత్య ప్రసాద్ యంత్రాంగాన్ని ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్లు బీఎస్ లత, గౌతమ్ రెడ్డితో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. వివిధ సమస్యలపై వచ్చే అర్జీలను సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి తగు చర్యలు తీసుకుని, దాని సమాచారాన్ని అర్జీదారునికి ఎప్పటికప్పుడు తెలియజేయాలని సూచించారు. కాగా, ప్రజావాణిలో మొత్తం 35 ఫిర్యాదులు, వినతులు వచ్చాయని, పరిష్కారానికి అధికారులు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇక్కడ జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి ఆర్డీవోలు మధుసూదన్, ఎన్ శ్రీనివాస్, జివాకర్, కలెక్టరేట్ ఏఓ హన్మంతరావు, డీఆర్డీఏ రఘు వరణ్ పాల్గొన్నారు.

### ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తాం

ప్రభుత్వ ప్రజాపాలన విజయోత్సవ సాంస్కృతిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తామని కలెక్టర్ బీ సత్య ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. జగిత్యాలలోని ఎస్వీఎల్‌ఆర్ గార్డెన్‌లో ప్రాంగణంలో మంగళవారం సాయంత్రం 6గంటలకు సంగీత నాటక అకాడమీ చైర్ పర్సన్ అలేఖ్య పుంజల కళాబృందం ఆధ్వర్యంలో 'జయ జయహే ప్రజాపాలన' పేరిట సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులను ఆహ్వానం పంపినట్లు వివరించారు. నగరప్రజలు, ఉద్యోగులు అధిక సంఖ్యలో హాజరుకవాలని కోరారు.

## ఆలయ పునర్నిర్మాణానికి విరాళం



విరాళాన్ని అందజేస్తున్న వడ్డెపల్లి శ్రీనివాస్ దంపతులు

మారుతీనగర్, డిసెంబర్ 2: మెట్‌పల్లి పట్టణ శివ భక్త మార్కండేయ ఆలయ పునర్నిర్మాణానికి పట్టణానికి చెందిన వడ్డెపల్లి శ్రీనివాస్ దంపతులు రూ.51వేల విరాళాన్ని సోమవారం వారి స్వగృహంలో పద్మశాలి పట్టణాధ్యక్షుడు ద్యావనపల్లి రాజారాంకు అందజేశారు. ఇక్కడ పద్మశాలి సంఘ ఉపాధ్యక్షులు సంకు ఆనంద్, అన్నం నాగరాజు, కోశాధికారి బేతు భాస్కర్, ప్రచార కార్యదర్శి ద్యావనపల్లి గణేశ్, కార్యవర్గ సభ్యులు గురుడు హనుమాండ్లు, పిన్నంశెట్టి గంగాధర్, ఆడెపు రమణ, శ్యామ్ సంఘ సభ్యులున్నారు.

## యాదవుల ఐక్యతే లక్ష్యం

రాయికల్, డిసెంబరు 2: యాదవుల ఐక్యతే లక్ష్యంగా ముందుకు సాగుతామని యాదవ సంఘం అడ్‌హక్ కమిటీ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు గనవేని మల్లేశ్ యాదవ్ పేర్కొన్నారు. కట్కాపూర్‌లో సోమవారం యాదవ సంఘం సమావేశం నిర్వహించి, మాట్లాడారు. యాదవులంతా ఐక్యంగా ఉండి తమ సంఘాన్ని బలోపేతం చేసుకుందామని పిలుపునిచ్చారు. అనంతరం యాదవ సంఘం సభ్యత్వాలను నమోదు చేసి, రసీదులను అందజేశారు. ఇక్కడ జిల్లా సలహాదారుడు రెబ్బాసు మల్లయ్య, యాదవ సంఘం అడ్‌హక్ కమిటీ మండల ఇన్‌చార్జిలు గంగుల తిరుపతి యాదవ్, మాదం మల్లేశ్ యాదవ్, రాజేందర్ యాదవ్, ముద్దం రమేశ్ యాదవ్, రాజేశ్ యాదవ్ పాల్గొన్నారు.

## హ్యాండ్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



రచన, రుచితను అభినందిస్తున్న ఎంఈవో యాళ్ల మధుసూదన్‌రెడ్డి

మేడిపల్లి, డిసెంబర్ 2: నిజామాబాద్ జిల్లాలో ఇటీవల జరిగిన ఉమ్మడి జిల్లా హ్యాండ్ బాల్ పోటీల్లో భీమారం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు పుప్పాల రచన, చిలువేరి రుచిత ప్రతిభచూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం జవ్వాజి అశోక్, వ్యాయామ ఉపాధ్యాయుడు పెసరి తిరుమలేష్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులను సోమవారం భీమారం ఎంఈఓ యాళ్ల మధుసూదన్‌రెడ్డి అభినందించి, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రసాద్, శ్రీధర్, రమేశ్, నరేందర్, అప్సర్, నజీమా సాహెబా, జయశ్రీ, నీలిమ, సంధ్యారాణి, రాణి, నవ్య, మాజీ సర్పంచ్ చెక్కపల్లి అరుణ, రఘు, మాజీ ఎంపీటీసీ పల్లి అర్జున్, ఏఎంసీ చైర్మన్ డిండిగాల లావణ్య, నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా పోలి పాడ్యమి వేడుకలు

కోరుట్ల, డిసెంబర్ 2: పట్టణంలోని కొత్త బస్టాండు సమీపంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో సోమవారం పోలి పాడ్యమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం, మన్యుసూక్త సహిత అభిషేకం, అన్నపూజ జరిపించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఇక్కడ ఆలయాధికారి విక్రమ్, జూనియర్ అసిస్టెంట్ పెడివల్లి నర్సయ్య, అర్చకులు శ్రీకాంత్, శ్యాంసుందర్, శ్రీధర్ ఉన్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

రాయికల్,డిసెంబర్ 2: విద్యార్థులు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని రాయికల్ ఎస్ఐ సుధీర్ రావు సూచించారు. సోమవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జగిత్యాల జిల్లా సైబర్ నేరాల నియంత్రణ కోఆర్డినేషన్ సెల్, పోలీసు శాఖ ఆధ్వర్యంలో పోలీస్ అనుబంధ కళాబృందం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాకారులు పాటలు పాడి విద్యార్థులను చైతన్య పరిచారు. ఇక్కడ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పుప్పాల దేవేందర్, ఎస్ రాజేంద్రప్రసాద్, మనోహర్ రెడ్డి, ఏఎస్ఐ దేవేందర్ పాల్గొన్నారు.

## ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి

పెగడపల్లి, డిసెంబర్ 2: ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని పెగడపల్లి తహసీల్దార్ రవీందర్ కోరారు. కార్యాలయంలో సోమవారం ప్రజల నుంచి వివిధ సమస్యలపై దరఖాస్తులు, ఫిర్యాదులు స్వీకరించారు. ఎంపీడీవో మహేందర్, ఆర్ఐ శ్రీనివాస్, ఏవో శ్రీకాంత్, ఈజీఎస్ ఏపీవో అనిల్‌కుమార్ ఉన్నారు.

# జగిత్యాలలో ట్రాన్స్ జెండర్ క్లినిక్ ప్రారంభం

జగిత్యాల రూరల్, డిసెంబర్ 2: ట్రాన్స్ జెండర్లకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా మైత్రి ట్రాన్స్ జెండర్స్ క్లినిక్‌లను ఏర్పాటు చేయగా, సోమవారం సీఎం రేవంత్ రెడ్డి వర్చువల్‌గా ప్రారంభించారు. ఇందులో భాగంగా జిల్లా కేంద్రంలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక క్లినిక్‌ను జిల్లా అధికారులు ప్రారంభించారు. ఇక్కడి సెంటర్ ద్వారా ట్రాన్స్ జెండర్లకు ఆరోగ్య, ఆరోగ్యేతర సేవలపై కౌన్సెలింగ్, లింగ ఆధారిత, సాధారణ ఆరోగ్య సేవలు, తదితర వ్యాధులకు చికిత్స అందించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి, బోనగిరి నరేష్, మాతా శిశు ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ రాములు మాట్లాడుతూ ట్రాన్స్ జెండర్లు ఈ క్లినిక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



జిల్లా కేంద్రంలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక క్లినిక్‌ను ప్రారంభిస్తున్న అధికారులు

# కుటుంబ సర్వే డాటా ఎంట్రీని వేగవంతం చేయాలి



మెట్‌పల్లి: డాటా ఎంట్రీని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ మోహన్

మెట్‌పల్లి, డిసెంబర్2: సమగ్ర కుటుంబ సర్వేకు సంబంధించి ఆన్‌లైన్‌లో డాటా ఎంట్రీ ప్రక్రియను వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ మోహన్ సూచించారు. సోమవారం మెట్‌పల్లిలో డాటా నమోదు ప్రక్రియను పరిశీలించారు. తప్పులు లేకుండా త్వరగా పూర్తి చేయాలని ఆపరేటర్లకు సూచించారు. ఇక్కడ డీఈఈ నాగేశ్వర్‌రావు, మేనేజర్ వెంకటలక్ష్మి ఉన్నారు.

### ఆన్ లైన్ డాటా ఎంట్రీ పూర్తి

పెగడపల్లి, డిసెంబర్ 2: మండలానికి సంబంధించి ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే ఆన్‌లైన్ డాటా ఎంట్రీ నమోదు ప్రక్రియ పూర్తయిందని ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. 23 గ్రామ పంచాయతీలకు సంబంధించి 15,420 కుటుంబాలను గుర్తించినట్లు చెప్పారు. ఈ క్రమంలో సేకరించిన కుటుంబాల సమాచారాన్ని మండల పరిషత్ కార్యాలయంలో పదిరోజులుగా ఆన్‌లైన్‌లో నమోదు చేయించినట్లు చెప్పారు.

## ఆర్‌ఎంపీ, పీఎంపీ నూతన కమిటీ

కోరుట్ల, డిసెంబర్ 2: కోరుట్ల పట్టణ ఆర్‌ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. పట్టణంలోని ఓ హోటల్‌లో సమావేశమై, తమ సమస్యలపై చర్చించారు. పరిధి మేరకు వైద్యం అందించాలని, ఔషధాలు క్లినిక్‌లో నిల్వ ఉంచవద్దని అధ్యక్షుడు శ్రీపతి సూచించారు. అనంతరం అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా సిద్దీఖీ, కోశాధికారిగా సాంబారు అశోక్, సహ కార్యదర్శిగా నజీబుల్లా, గౌరవాధ్యక్షుడుగా అబ్దుల్లా, గౌరవ సలహాదారులుగా ఆడెపు వెంకటేశ్, ముఖ్య సలహాదారులుగా స్వామి, సత్యం, రమేశ్, గంగాధర్, రామ్మోహన్, అంజాత్ ప్రమాణస్వీకారం చేశారు.

## ఆటో డ్రైవర్ నిజాయితీ

జగిత్యాల టవర్ సర్కిల్, డిసెంబర్ 2: ఆటో డ్రైవర్ నిజాయితీ చాటుకున్నాడు. మొయినాబాద్‌కు చెందిన ఓ మహిళ సోమవారం ధర్మపురి నృసింహుడి క్షేత్రానికి వచ్చింది. మార్గంమధ్యలో వెల్గొండ వద్ద తన బ్యాగ్ పోగొట్టుకోగా, జగిత్యాలకు చెందిన ఆటో డ్రైవర్ రాజుకు దొరికింది. అందులో విలువైన బంగారు ఆభరణాలు, మొబైల్ ఫోన్, నగదు ఉంది. అయితే అప్పటికే సదరు మహిళ మరో ఫోన్ నుంచి తన తన ఫోన్‌కు కాల్ చేయగా, రాజు లిఫ్ట్ చేశాడు. ఆమెతో మాట్లాడాడు. బ్యాగ్ ఆమెదే అని నిర్ధారించుకున్న తర్వాత తోటి ఆటో డ్రైవర్లతో కలిసి ఆమెకు అందజేశాడు.

## నేడు ఎమ్మెల్యే సంజయ్ పర్యటన

మెట్‌పల్లి/కోరుట్ల, డిసెంబర్2: కోరుట్ల ఎమ్మెల్యే డా.కల్వకుంట్ల సంజయ్ మంగళవారం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. మెట్‌పల్లి పట్టణంలో మెప్మా నూతన భవనాన్ని ప్రారంభిస్తారు. కోరుట్ల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పట్టణ, కోరుట్ల మండలానికి సంబంధించిన లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన ఆర్థిక సాయం చెక్కులను పంపిణీ చేస్తారు. అలాగే కోరుట్ల పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవన నిర్మాణానికి, ఇబ్రహీంపట్నం మండలం వర్షకొండలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని రైతు వేదికలో మండలానికి చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తారని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వర్గాలు తెలిపాయి.

## తుల ఉమ పరామర్శ

కథలాపూర్, డిసెంబర్ 2: భూషణరావుపేట గ్రామానికి చెందిన దీకొండ సురేశ్ అనే యువకుడు ఇటీవల సౌది అరేబియాలో గుండెపోటుతో మృతిచెందగా, బాధితకుటుంబసభ్యులను సోమవారం కరీంనగర్ మాజీ జడ్పీ అధ్యక్షురాలు, బీఆర్‌ఎస్ నాయకురాలు తుల ఉమ పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని బాధితకుటుంబసభ్యులను ఓదార్చారు. సురేశ్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు.

## అంబారిపేటలో యోగా శిక్షణ తరగతులు

వెల్గటూర్, డిసెంబర్ 2: ఎండపల్లి మండలంలోని అంబారిపేటలో నేషనల్ ఆయూష్ మిషన్ ఆధ్వర్యంలో యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు శిక్షకులు బ్రహ్మణపల్లి రవి తెలిపారు. ప్రతి రోజు ఉదయం 6 నుంచి 7 గంటల వరకు జరుగుతాయని, మహిళలుకు, పురుషులకు వేర్వేరుగా తరగతులు నిర్వహిస్తున్నామని, ఆసక్తి ఉన్న వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## ఉమామహేశ్వరస్వామి ఆలయంలో అన్నదానం

మల్లాపూర్, డిసెంబర్ 2: కొత్తదాంరాజ్‌పల్లి గ్రామంలోని ప్రసిద్ధి చెందిన ఉమామహేశ్వరస్వామి ఆలయం వద్ద గ్రామానికి చెందిన సింగిరెడ్డి రాంరెడ్డి–శంకరమ్మ దంపతుల ఆధ్వర్యంలో భక్తులకు సోమవారం అన్నదానం చేశారు. అంతకు ముందు ఆలయంలో వారు ప్రత్యేక పూజలు చేశారు. ఇక్కడ ఆలయ, వీడీసీ కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

## ప్రత్యేక పారిశుధ్య పనులు

మెట్‌పల్లి, డిసెంబర్2: ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా మెట్‌పల్లి పట్టణంలో మున్సిపల్ ఆధ్వర్యంలో ప్రత్యేక పారిశుధ్య పనులు నిర్వహించారు. అంబేద్కర్ పార్కును శుభ్రం చేసి చెత్తను ట్రాక్టర్ ద్వారా తరలించారు. అలాగే పలు వార్డుల్లో డ్రైనేజీ, మురుగు గుంతల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లారు. రోడ్లపై చెత్తా, చెదారం వేయొద్దని, మున్సిపల్ వాహనం వచ్చినప్పుడు సిబ్బందికి అందజేయాని మున్సిపల్ కమిషనర్ మోహన్ స్థానిక ప్రజలను కోరారు. ఇక్కడ సిబ్బంది రత్నాకర్, ముజీబ్ పాల్గొన్నారు.

## కరాటేలో ప్రతిభ

జగిత్యాల రూరల్, డిసెంబర్ 2: వరంగల్ జిల్లా నర్సంపేటలో నిర్వహించిన కరాటే బెల్ టెస్ట్‌లో జగిత్యాలకు చెందిన సీనియర్ కరాటే క్రీడాకారుడు నీలగిరి వికాస్ రావు విశేష ప్రతిభచూపి బ్లాక్ బెల్ట్ సాధించారు. వికాస్ రావును జగిత్యాల కరాటే ప్రెసిడెంట్ పల్లెపు మొగిలి, చైర్మన్ ఎం లింగయ్య తదితరులు అభినందించారు. ఇక్కడ కోచ్ ఆరుమ్ము పవన్, గంగాధర్, ఆకాశ్ ఉన్నారు.

## రూ.లక్ష బీమా చెక్కు అందజేత

ధర్మపురి, డిసెంబర్ 2: గాయత్రీ బ్యాంకు ఖాతాదారుడైన రాయపట్నం గ్రామానికి చెందిన బుద్దె తిరుపతి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, అతని నిర్భయ సేవింగ్ ఖాతాపై రూ.లక్ష బీమా సౌకర్యం ఉంది. ఈ క్రమంలో బీమా సొమ్ము చెక్కును ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విప్ లక్ష్మణ్‌కుమార్ సోమవారం తిరుపతి కుటుంబసభ్యులకు అందజేశారు. ఇక్కడ బ్యాంకు మేనేజర్ వొజ్జల మోహన్ ఉన్నారు.

## వెల్గటూర్‌లో అయ్యప్ప పడి పూజ

వెల్గటూర్, డిసెంబర్ 2: మండల కేంద్రంలో పెద్ది శ్రీనివాస్ ఆధ్వర్యంలో ధర్మపురికి చెందిన రాజేశ్ గురు స్వామి అయ్యప్ప పడి పూజ సోమవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు కుంకుమ పూజలు చేశారు. అనంతరం స్వాములకు అన్న ప్రసాదం వితరణ చేశారు. ఇక్కడ గురు స్వాములు తిప్పర్తి చంద్రమౌళి, సంకోజు నరేశ్, మంచాల గోపాల్, పెద్దూరి భరత్‌కుమార్, గంధ్ర రంజిత్‌రావు, బోడకుంటి రమేశ్, గంట్యాల రాజేందర్, సిరంగి సంతోశ్ ఉన్నారు.

## తాటిపల్లి, లంబాడిపల్లిలో నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మల్యాల, డిసెంబర్ 2 : కొండగట్టు ఫీడర్‌లో 33 కేవీ విద్యుత్‌లైన్ల కింద ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్నందున తాటిపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ మల్యాల ఏఈఈ దయానంద్ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు తాటిపల్లి, లంబాడిపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, గృహ, వ్యవసాయ, వాణిజ్య విద్యుత్ వినియోగదారులు తమకు సహకరించాలని కోరారు.

## 4న శాంతియుత నిరసన ర్యాలీ

జగిత్యాల టౌన్, డిసెంబర్ 2: బంగ్లాదేశ్‌లో హిందువులపై రోజు రోజుకూ పెరుగుతున్న దాడులను నిరసనగా హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో వివిధ హిందూ సంస్థల ఆధ్వర్యంలో ఈ నెల 4న జగిత్యాలలో శాంతియుత నిరసన ర్యాలీని నిర్వహిస్తున్నట్లు విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు బోయిని పద్మాకర్ తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సంస్థ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. హిందూ రహిత బంగ్లాదేశ్‌గా మార్చే కుట్ర జరుగుతున్నదని, నిత్యం హత్యాకాండలు, దాడి ఘటనలు హిందూ సమాజాన్ని కలవరపెడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అన్యాయంపై దేశంలోని ఏ ఒక్క రాజకీయ పార్టీ నాయకుడు మాట్లాడకపోవడం శోచనీయమన్నారు. కేంద్రం చొరవ తీసుకొని బంగ్లాదేశ్‌లో హిందువుల రక్షణకు తగిన చర్యలు తీసుకోవడంతో పాటు ఆ దేశంపై అంతర్జాతీయంగా ఒత్తిడి పెంచాలని కోరారు. యావత్ హిందూ సమాజం బంగ్లాదేశ్‌లోని హిందువులకు తమ మద్దతు ఇవ్వాలని కోరారు.

## నలంద డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

జగిత్యాల టౌన్, డిసెంబర్ 2: జిల్లా కేంద్రంలోని నలంద డిగ్రీ కళాశాలలో యాక్సిస్ బ్యాంక్, సర్వగం ఫైనాన్స్ సంస్థల్లో ఉద్యోగాల కోసం 4న ఉదయం 10 గంటలకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల కరస్పాండెంట్ శ్రీపాద నరేష్ ప్రకటనలో పేర్కొన్నారు. ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన, 30 ఏండ్లలోపు వయస్సు ఉన్న యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## హర్షణీయం

జగిత్యాల డిసెంబర్ 2: ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు మరణిస్తే ప్రభుత్వం ఇస్తున్న అంత్యక్రియల ఖర్చులను రూ.20 వేల నుంచి రూ.30 వేలకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై తెలంగాణ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. మొదటి పే రివిజన్ కమిషన్ సిఫార్సుల మేరకు అంత్యక్రియల ఖర్చులు పెంచుతూ నిర్ణయం తీసుకోవడం సంతోషంగా ఉందని చెప్పారు.

## మల్యాలలో ముగిసిన ఐకేపీ ధాన్యం కొనుగోళ్లు

మల్యాల, డిశంబర్ 2: మండలంలో మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యుల నేతృత్వంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ పూర్తయినట్లు ఐకేపీ ఏపీఎం చిన్నరాజయ్య తెలిపారు. మొత్తం నాలుగు కేంద్రాలను నిర్వహించి, 624 మంది రైతుల నుంచి 31,516.80 క్వింటాళ్ల ధాన్యం సేకరించి, రూ.7.31కోట్లు చెల్లింపులు కూడా చేసినట్లు వివరించారు. తమకు సహకరించిన నిర్వాహకులు, అధికారులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు చెప్పారు.

## బహుమతుల ప్రదానం..

ధర్మపురి,డిసెంబర్ 2: ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి సోమవారం బుగ్గారం జడ్పీ పాఠశాలలో ఎంఈవో వెంకటేశ్వర్లు బహుమతులు ప్రదానం చేశారు. వెల్గొండ జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి అశ్విత్‌కుమార్ (ప్రథమ బహుమతి), బుగ్గారం జడ్పీహెచ్ విద్యార్థిని శ్రావ్య (ద్వితీయ), బుగ్గారం శ్రీగ్లోబల్ పాఠశాల విద్యార్థి సృజన్( తృతీయ) బహుమతి గెలుపొందారు. ఇక్కడ హెచ్‌ఎం మోహన్‌రెడ్డి, సీఆర్పీ పురుషోత్తం ఉన్నారు.